క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న ఆర్యవైశ్య మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో కొలువైన ప్రసిద్ధ కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారిని సోమవారం కాగజ్ నగర్ ఆర్యవైశ్య సంఘం మహిళలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సారె సమర్పించారు. ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు, వివిధ రకాల నైవేద్యాలు, గాజులు సమర్పించారు. లలిత పారాయణం చేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ స్వామి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్ టౌన్: ఆసిఫాబాద్‌లో దుర్గాదేవి నిమజ్జనం సందర్భంగా హిందువులపై దాడి చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నివాసంలో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో దుర్గాదేవి నిమజ్జనంలో హిందూ మహిళలు, పురుషులపై దాడి చేసిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని జైనూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు హిందువులపై అణచివేత అధికమైందన్నారు.

నిత్యం యోగాతో ఒత్తిడి దూరం



యోగా ఆసనాలు చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: నిత్యం యోగాతో ఒత్తిడి దూరమవుతుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆదిలాబాద్ కింగ్స్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులు శారీరకంగా, మానసింగా దృఢంగా ఉండేందుకు ప్రతినిత్యం యోగా చేయాలన్నారు. మారుతున్న జీవన విధానంతో విద్యార్థులు అనేక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. యోగా గురువు చిన్నయ్య, ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ ప్రకాష్, భగవన్ దుర్గా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తలమడుగు: మండలంలోని సుంకిడి రైతువేదికలో స్థానిక సంస్థల ఎన్నికలపై అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మాస్టర్ ట్రైయినర్ ప్రతాప్, మహేంద్ర ఎన్నికల్లో పొటింటీ నిబంధనలపస అవగాహన కల్పించారు. ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. జరగబోయే ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లను ఎలా ఉపయోగించాలని వివరించారు. విధులలో నిర్లక్ష్యం చేయవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీడీవో, సిబ్బంది పాల్గొన్నా రు.

స్థానిక సంస్థల ఎన్నికల బరిలో సీపీఎం

ఉట్నూర్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల బరిలో సీపీఎం ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూసం సచిన్ అన్నారు. సోమవారం ఉట్నూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజల అండతోనే పోటీలో ఉంటామన్నారు. కార్యక్రమం నాయకులు బొజ్జ ఆశన్న, ఉయిక విష్ణు, మడవి నాగోరావ్, సునీల్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సాత్నాల, 12 గంటలకు ఆదిలాబాద్ రూర ల్, మధ్యాహ్నం 1గంటకు మావల మండల నాయకులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి నా యకులు హాజరు కావాలని కోరారు.

అధ్వానంగా రోడ్లు.. వెళ్లేదెలా?

- గ్రామస్తులకు కాలినడకే శరణ్యం
- అత్యవసర పరిస్థితుల్లో తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

పెంచికల్‌పేట్: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు, రోడ్లు, రవాణా వ్యవస్థలను మెరుగు పరిచేందుకు నిధులను విడుదల చేస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించడం లేదు. కనీసం గ్రామాలకు సరైన రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయంలో రాళ్లు తేలిన రహదారి, బురద రోడ్లపైన ప్రయాణిస్తూ.. కాలం వెల్లదీస్తున్నామని గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ, మురళీగూడ, జిల్లెడ గ్రామాల ప్రజల వాపోతున్నారు.

ప్రైవేటు వాహనాలే దిక్కు..

అగెర్‌గూడ నుంచి మురళీగూడ, జిల్లెడ, బెజ్జూర్‌కు వెళ్లేందుకు గ్రామస్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కమ్మర్‌గాం నుంచి మురళీగూడకు చేరుకోవడానికి గ్రామస్తులు 5 కిలోమీటర్లు కాలినడక ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుట్టపైన ఉన్న తాత్కాలిక రోడ్డు కోతకు గురై రాళ్లు తేలాయి. అత్యవసర సమయంలో కనీసం అంబులెన్స్ సైతం వెళ్లాలేని పరిస్థితి. మరో వైపు కమ్మర్‌గాం నుంచి పెంచికల్ పేట్, కమ్మర్‌గాం నుంచి బెజ్జూర్ చేరుకునేందుకు గ్రామస్తులు సుమారు 15 కిలోమీటర్లు బురద రోడ్లపై ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



గుట్టపైన కోతకు గురైన రోడ్డు

రాళ్లు తేలిన రహదారి



జిల్లెడ గ్రామానికి వెళ్లే రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. గుట్టపైన ద్విచక్రవాహనాలు సైతం వెళ్లే పరిస్థితి లేదు. అత్యవసర సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలినడకన కమ్మర్‌గాం చేరుకుని అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాల్లో చేరుకుంటున్నాం.

– పౌనెం విజయ్, జిల్లెడ

మరమ్మతులు చేయాలి



గిరి గ్రామాలకు వెళ్లే రహదారులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బురదమయంగా మారాయి. ప్రైవేట్ వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. అనేక అవస్థలు పడుతూ ప్రయాణం సాగిస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి పక్కా రోడ్డు నిర్మించాలి.

– వెంకటేశ్, మురళీగూడ

సంప్రదాయానికి ప్రతీక.. 'బులాయి'



మట్టితో చేసిన బోండోబా దేవుని ప్రతిమ (ఫైల్)

- నేడు ఐనం గ్రామంలో వేడుకలు

దహెగాం: జిల్లాలోని ఒక్కో ప్రాంతం ఒక్కో సంప్రదాయానికి పెట్టింది పేరు. ప్రజలు విభిన్నంగా పండుగలు జరుపుకొంటారు. దహెగాం మండలం రాళ్లగూడ, ఐనంతోపాటు పలు గ్రామాల్లో నేటి నుంచి రెండురోజులపాటు బులాయి పండుగ జరుపుకోనున్నారు. జిల్లాలోనే ఐనం గ్రామంలో జరుపుకొనే బులాయి మాత్రం చాలా ఫేమస్. దసరా, బతుకమ్మ పండుగలు ముగిసిన తర్వాత వచ్చే పౌర్ణమి నాడు బులాయి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

తొలిరోజు 'బోండోబా'కు పూజలు..

బులాయి పండుగ సందర్భంగా మంగళవారం బ్యాండు మేళాలు, భక్తిశ్రద్ధలతో గ్రామ సమీపంలోని పుట్ట మట్టి తీసుకువస్తారు. బోండోబా విగ్రహం ప్రతిష్ఠిస్తారు. నైవేద్యం సమర్పించి పూజలు చేసి బులాయి ఆడతారు. సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేస్తారు. అలాగే మరుసటి రోజు బుధవారం సాయంత్రం నుంచి రాత్రంతా బులాయి ఆడి బోండోబా విగ్రహాలను సమీపంలోని వాగులో నిమజ్జనం చేస్తారు. పండుగకు దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులందరూ స్వగ్రామాలకు చేరుకుంటారు. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళందరూ కొత్త బట్టలు ధరించి ఉత్సాహంగా వేడుకలు జరుపుకొంటారు. గ్రామంలో బొమ్మల దుకాణాలు, గాజుల దుకాణాలు ఏర్పాటు చేస్తారు. దీంతో సందడి వాతావరణం నెలకొంటుంది.

భక్తిశ్రద్ధలతో శరత్ పూర్ణిమ

ఆసిఫాబాద్‌అర్బన్: శరత్ పూర్ణిమ వేడుకలను జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 12 గంటలకు చంద్రుని కిరణాలు క్షీరంలో పడిన తీర్థాన్ని భక్తులు అమృతంగా భావించి స్వీకరించారు. దీనినే కోజాగిరి పండుగ అనికూడా పిలుస్తారు. ఈ తీర్థాన్ని స్వీకరించడం వలన ఆరోగ్యంగా ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. చంద్రబింబం పడిన తర్వాత ఆలయాల్లో మంగళహారతి, మంత్రపుష్పాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు.



పాలలో చంద్రబింబం పడేలా చూపిస్తున్న భక్తులు

సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలి

కాగజ్‌నగర్ టౌన్: ప్రతిఒక్కరూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని బీజేపీ పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చిప్పకుర్తి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సంజీవయ్య కాలనీలో ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అంతకు ముందు భారతమాత చిత్రపటాలకు పూలమాల వేసి ఆర్‌ఎస్‌ఎస్ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు



భవనంపై చెట్లు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌యార్డులోని నిరుపయోగంగా ఉన్న భవనంపై మొక్కలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. మార్కెట్ కమిటీ అధికారులు కార్యాలయ నిర్వహణ బాధ్యతలను సరిగా చేపట్టకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఆఫీస్‌కు వచ్చామా? వెళ్లామా? తప్పా.. ఇతర విషయాలను పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన బోనగిరి నాగరాణికి వాసవి కుటుంబ సురక్ష పథకం కింద రూ.3,84,000 చెక్కును పథకం చైర్మన్ యాద నాగేశ్వర్‌రావు, ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణతో కలిసి హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ క్లబ్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. క్లబ్ సభ్యుడు బోనగిరి దత్తాత్రి అనారోగ్యంతో మృతి చెందంతో రెండో విడత చెక్కు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికే తొలివిడతలో రూ.5.30 లక్షల చెక్ అందజేయగా, తాజాగా రెండో విడత చెక్ అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రేణికుంట్ల శ్రీనివాస్, ఎకిరాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి, జంబుగ, దుర్గానగర్ రైతువేదికల్లో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కిసాన్ కపాస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.


బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోనేరు కోనప్ప

పెంచికల్‌పేట్: మండలంలోని కమ్మర్‌గాం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శ్రీ నివాస్, సంజీవ్, సుధాకర్, రాజన్న మాజీ ఎంపీటీసీ సాజీద్, తిరుపతి, వెంకన్న, పుల్లయ్య, వెంకటి, రామన్న పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న ప్రకాష్

పెంచికల్‌పేట్: మండలంలోని బొంబాయిగూడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు సామాజిక కార్యకర్త చప్పిడే ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహేశ్, నగపురి ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన కొడప సతీష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. బాధిత కుటుంబసభ్యులకు కాంగ్రెస్ నాయకులు సోమవారం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సిరిపురం సదాశివ్, జాడి సంతోష్, అతహాబేగ్, భుజంగరావు, బాపు, ఇలియాస్, ఆశన్న, లహంచు, నారాయణ, హన్మంతు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నగదలు అందచేస్తున్న నాయకులు

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

- రైతులు కపాస్ కిసాన్ యాప్ వినియోగించుకోవాలి
- జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

మంచిర్యాలఅగ్రికల్చర్: పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. సోమవారం మంచిర్యాల కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మంచిర్యా ల, కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా మార్కెటింగ్ అధికారులు షహబుద్దీన్, అశ్వక్ అహ్మద్‌తో కలిసి కపాస్ కిసాన్ యాప్ వినియోగం, రైతుల వివరాల నమోదు, పత్తి విక్రయం అంశాలపై శిక్షణ కార్యక్ర మం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పత్తి విక్రయించేందుకు కపాస్ యాప్‌లో తమ వివరాలు నమోదు చేసునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఆధార్ కార్డులో వేలిముద్ర, కంటి స్కాన్, మొబైల్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. ఆధార్‌కు అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాలోనే నగదు చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. పత్తికి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.8,110 నుంచి రూ.8,010 నిర్ణయించినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారులు, మార్కెటింగ్ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉలెన్ జాకెట్లు, టీషర్టులు పంపిణీ

ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసులకు విధి నిర్వహణలో రక్షణగా ఉండేందుకు సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సిబ్బంది, హోంగార్డులకు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఉలెన్ జాకెట్లు, టీ షర్ట్స్, హోంగార్డులు, రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది వాతావరణ మార్పులకు తట్టుకుని విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో పర్యటన సమయంలో అనుకూలంగా ఉండేందుకు అవసరమైన వస్తువులు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ(అడ్మిన్) పెద్దన్న, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చాలి

రెబ్బెన: మండలంలోని పెద్దవాగు సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెద్దవాగు బ్రిడ్జీ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం నడిచే ఈ రహదారిపై గుంతలు పడి అధ్వానంగా మారినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా కమిటీ సభ్యుడు చాపిడి శివ ఉన్నారు.



గుంతలను చూపుతున్న పురుషోత్తం

పిడుగు పాటుతో మూడెడ్లు మృతి



కౌటాల: విలపిస్తున్న రైతు దంపతులు


కౌటాల: మండలంలోని ముత్తంపేటలో రైతు బెండరే శ్యాంరావ్‌కు చెందిన జోడెద్దులు ఆదివారం రాత్రి పిడుగు పాటుతో మృతి చెందాయి. ఉదయం ఎద్దులను గ్రామ శివారులోకి మేతకు తీసుకెళ్లగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో చేను వద్దే వాటిని కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి పిడుగుపడడంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దుల విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రెబ్బెన: మండలంలోని చిలుకమర్రిగూడలో ఓరగంటి భీమయ్యకు చెందిన ఎద్దు పిడుగుపాటుతో మృత్యువాత పడింది. సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లేందుకు భీమయ్య సిద్ధమవుతుండగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. దీంతో ఎద్దులను ఇంటివద్దే కట్టేసి ఉంచాడు. సమీపంలో పిడుగుపడడంతో ఒక ఎద్దు మృతి చెందింది. పశువైద్యాధికారి సందీప్ సంఘటన స్థలానికి చేరుకుని ఎద్దును పరిశీలించారు. ఎద్దు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



రెబ్బెన: ఎద్దును పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి

విద్యుత్ కోతలతో అంధకారం



అంధకారంలో లారీ చౌరస్తా

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో తరుచు విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు. సమయం, సందర్భం లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, దుకాణ యజమానులకు ఇబ్బందిగా మారుతుందన్నారు. చిన్నపాటి వర్షం కురిసినా.. కరెంట్ పోతుండడంతో దోమలతో నరకయాతన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.